క్లుప్తంగా

స్వామివారి సన్నిధిలో ఆర్డీవో



అంతర్వేది ఆలయంలో ఆర్డీవోకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం అమలాపురం ఆర్డీవో జి.కేశవవర్ధన్ రెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు సుదర్శనం రమేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. ఆర్డీవోకు లడ్డూ ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, డీటీ సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

సఖినేటిపల్లి: రాష్ట్రంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యమిస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం ఉయ్యూరువారి మెరక గాంధీనగర్ వీవర్స్ కాలనీలో చేనేత కమ్యూనిటీ హాల్‌లో మోరి వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు చింతా వీరభద్రేశ్వరరావు అధ్యక్షతన జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నేత కార్మికులు ఆరుగురికి ఎమ్మెల్యే సత్కారాలు చేశారు. చేనేత వస్త్రాలకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇచ్చి నేతన్నలకు ప్రోత్సాహం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్టీసీ బస్ ఢీకొని చూడి ఆవు మృతి

అంబాజీపేట: స్థానిక పశువుల ఆస్పత్రి సమీపాన బుధవారం ఆర్టీసీ బస్ మూడు నెలల చూడి ఆవును ఢీ కొట్టడంతో అక్కక్కడిక్కడే మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యసాయినగర్‌లో పెదమల్లు గుప్తాకు చెందిన మూడు నెలల చూడి ఆవును వీధి కుక్కలు వెంటపడి కరిచేందుకు ప్రయత్నించాయి. ఈ సమయంలో వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ప్రధాన రహదారి రోడ్డు దాటుతుండగా రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్ బలంగా ఢీ కొట్టడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.

అంతర్వేది ఆలయ ప్రాంగణంలో మొక్క నాటిన ఎమ్మెల్యే

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయ ప్రాంగణంలో ఎండోమెంట్స్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం వనమహోత్సవాన్ని ఆలయ ఏసీ వి.సత్యనారాయణ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీనివాస్, నాయకులు, ఆల య సిబ్బంది పాల్గొన్నారు. తొలుత ఆలయంలో ఎమ్మెల్యే వరప్రసాద్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

అక్రమ కనెక్షన్ల తొలగింపు

అయినవిల్లి: మండలంలోని పోతుకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో మంచినీటి ట్యాప్‌లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని మళ్లిస్తున్నారని ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై ఈఓపీఆర్డీ గరిమెళ్ల రవి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కల్యాణ్ ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో తనిఖీల ద్వారా అక్రమ ట్యాపులను గుర్తించి ఈఓపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ సిబ్బంది సాయంతో అక్రమ మంచినీటి ట్యాప్‌లను తొలగించారు. మరలా ఇటువంటి చర్యలు పునరావృతం అయితే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు.

ఘనంగా చేనేత దినోత్సవం



చేనేత కార్మికులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో చేనేత సొసైటీ వద్ద బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ నాయకులు చేనేత వస్త్రాలు కొనుగోలు చేశారు. గనిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. స్వదేశీ వస్త్రాలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఇది మనందరి బాధ్యత అన్నారు. చేనేత కార్మికులకు అండగా నిలిచి నేతన్నలకు భరోసా ఇవ్వాలన్నారు. అనంతరం చేనేత కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ అంకం వీర్రాజు, నాయకులు మల్లాది మల్లిబాబు, సొసైటీ మాజీ సెక్రటరీ పిచ్చిక చిన పల్లంరాజు, సీనియర్ చేనేత కార్మికులు కట్టా శ్రవణయ్య, చేనేత సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- క్లస్టర్ పరిధిలో 755 ప్రభుత్వ పాఠశాలలు
- 48,550 మంది విద్యార్థులు
- నేడు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఎన్నికల ప్రక్రియ



మండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు నిర్వహణకు విద్యా శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో మొత్తం 755 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా సుమారు 48,550 మంది విద్యార్థులు ఉన్నారు. ఎస్‌ఎంసీ ఎన్నికలకు విద్యాశాఖాధికారులు నోటిఫికేషన్ విడుదల చేయగా మండలాల్లో ఎంఈఓల పర్యవేక్షణలో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో గురువారం ఉదయం 7 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. దీనికి రిటర్నింగ్ అధికారులుగా హెచ్‌ఎంలు వ్యవహరిస్తారు. సెక్రటరీ, వీఆర్వోలు పరిశీలకులుగా ఉంటారు. విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఓటర్లుగా పాల్గొంటారు. 50 శాతం ఓటర్లు హాజరు కావాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ 15 మంది సభ్యులను, ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకూ 24 మంది, ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకూ 15 మంది సభ్యులను ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. అనంతరం తొలి సమావేశం నిర్వహిస్తారు. కమిటీ సభ్యుల ఎన్నికను చేతులు ఎత్తే పద్ధతిలో నిర్వహిస్తారు. ఆ పద్ధతికి అభ్యంతరం వస్తే రహస్య ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ కమిటీల పదవీ కాలం రెండేళ్లు.

గత ప్రభుత్వంలో పారదర్శకంగా ఎన్నికలు

గత ప్రభుత్వంలో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయి. గత విధానాలకు భిన్నంగా అన్ని స్కూళ్లలో టీడీపీకి చెందిన వారినే ఎన్నుకోవాలనే ప్రయత్నాలు సాగుతున్నట్టు సమాచారం. వివిధ పాఠశాలల్లో వైఎస్సార్ సీపీకి చెందిన వారు, తటస్థులైన తల్లిదండ్రులు పోటీకి సిద్ధమైతే అధికార కూటమి నాయకులు, కార్యకర్తలు బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలుస్తుంది. తమను కాదని పోటీ చేస్తే పింఛను, తల్లికి వందనం వంటి పథకాలు రావని హెచ్చరిస్తున్నట్టు సమాచారం. క్షేత్రస్థాయిలో రాజకీయంగా పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికలు వేదిక కానున్నాయి. అందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా పోటీకి గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు.

క్లస్టర్‌లో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

నియోజకవర్గం	పాఠశాలలు	విద్యార్థులు
కొత్తపేట	235	14,521
పి.గన్నవరం	291	19,500
రాజోలు	229	14,529
మొత్తం	755	48,550

పారదర్శకంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



ఎస్‌ఎంసీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. ఈ ఎన్నికలకు గ్రామ కార్యదర్శి, వీఆర్వోలు పరిశీలకులుగా వ్యవహరిస్తారు. ఎక్కడా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాదని భావిస్తున్నాం. ఎక్కడా సమస్యాత్మక పరిస్థితులు ఏర్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నాం.

– ఎం.హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

హిరోషిమా డే



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద ఉన్నత పాఠశాలలో హిరోషిమా డే నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) మలికిపురం మండలం అధ్యక్షుడు పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు పర్యావరణానికి, దేశ మానవాళికి ముప్పుగా ఉన్న అణ్వాయుధాలు అవసరం లేదని , సైన్స్ అభివద్ధికి మాత్రమే వినియోగించాలని, వినాశనానికి కాదని ఈరోజు హిరోషిమా, నాగసాకి ఉదంతాలు తెలియజేస్తున్నాయన్నారు. మూడో ప్రపంచ యుద్ధం జరిగితే మొత్తం జీవరాశులంతా నాశనం అవుతుందని హెచ్చరించారు. విద్యార్థులు గుడిమెళ్లంక వంతెన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. 'యుద్ధాలు వద్దు– ప్రపంచ శాంతి ముద్దు' 'అణ్వస్త్రాలు వద్దు–అన్నవస్త్రాలు ముద్దు' అంటూ పలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.పద్మజ, బి.ఫణి లక్ష్మి, కె.సునీత విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే చర్యలే..

ఎమ్మెల్యే సత్యనారాయణ



అంబాజీపేట ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

అంబాజీపేట: ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన గ్రామ సమస్యలు వచ్చే సర్వ సభ్య సమావేశానికి పరిష్కరించాలని లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.సరోవర్ పర్యవేక్షణలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం బుధవారం జరిగింది. గంగలకుర్రు అగ్రహారం సర్పంచ్ డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి నగదు జమ కాలేదన్నారు. దీనిపై ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది మే నెల తరువాత కొన్న ధాన్యం నగదు రావాల్సి ఉందని త్వరలో ఆయా రైతుల ఖాతాలో జమ చేస్తారన్నారు. జి.అగ్రహారంలో సాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కరించాలని ఇరిగేషన్ ఏఈ నవీన్‌కుమార్‌ను సర్పంచ్ నాగేశ్వరరావు ప్రశ్నించారు. అగ్రహారం పంట పొలాలకు నీరు ఇవ్వలేమని, ఎప్పటి నుంచో నీరు ఇవ్వడం లేదని ఇరిగేషన్ ఏఈ పొంతన లేని సమాధానం చెప్పారు. గత 50 ఏళ్ల నుంచి సుమారు 40 ఎకరాల్లో పంట కాలువ నీటి నుంచే సాగు చేస్తున్నామని మీకు కనిపించలేదా అని సర్పంచ్ నిలదీశారు. గంగలకుర్రులో గత నాలుగు నెలలుగా ఏఎన్‌ఎం లేక ఇబ్బందులు పడుతున్నామని ఎంపీటీసీ నెల్లి ఏడుకొండలు సమావేశానికి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఇసుకపూడిలో విద్యుత్ లైన్‌మెన్ లేక ఇబ్బందులు పడుతున్నామని ఎంపీటీసీ ఎం.ప్రశాంత్ అన్నారు. చిరతపూడిలో లైన్‌మన్ ఉన్నప్పటికీ ఎప్పుడూ అందుబాటులో ఉండడని, విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడితే నానా ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ కోట బేబిరాణి అన్నారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో ఖోఖో కోర్టును ఏర్పాటు చేస్తే ఎంతో మంది క్రీడాకారులకు ఉపయోగంగా ఉంటుందని ఎంపీటీసీ కుసుమ వెంకటేష్ అన్నారు. వీటితో పాటు పలు సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. దీనిపై ఎమ్మెల్యే సత్యనారాయణ స్పందించి మాట్లాడుతూ విధులు నిర్వహించడంలో అలసత్వం వహించినా, సమస్య పరిష్కరించకపోయినా, నిర్లక్ష్యంగా ఉన్న ఏ అధికారి అయినా ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లిపోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ఏ సంక్షేమ పథకమైన ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. వచ్చే సమావేశంలో సమస్యలు పరిష్కరించలేదని రాకూడదన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, డీటీ పి.నాగపద్మలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదీ



బట్టేలంకలో క్లాత్ సంచులు అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. 'ప్లాస్టిక్ కవర్ వద్దు–చేతి సంచే ముద్దు' అనే నినాదంతో మానవతా మూర్తులు– సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బట్టేలంకలో క్లాత్ సంచులను బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. సర్పంచ్ సీతారత్నం, అర్జునరావుల ఆర్థిక సహకారంతో తయారు చేసిన ఈ బయో డిగ్రేడబుల్ సంచులను ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. బట్టేలంక ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్పంచ్ సీతారత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, తదితర ఉత్పత్తుల వాడకం వలన పర్యావరణ కాలుష్యం పెరిగి మానవ జీవితానికే కాక సమస్త ప్రాణికోటికి చాలా ఇబ్బంది వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, మానవతా మూర్తులు గ్రూపు అడ్మిన్ బోనం రాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఆవుపాటి ఉమా లలిత శివజ్యోతి, గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, రావూరి నాగు, మల్లిపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

రాజోలు: మాదకద్రవ్యాల నివారణపై రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథులుగా అమలాపురం ఏరియా ఆస్పత్రి మానసిక వైద్య నిపుణురాలు సౌమ్య, అమలాపురం నోడల్ అధికారి డాక్టర్ జాన్‌లివి, రాజోలు సీఐ గోవిందరాజు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకూడదని, మత్తు మందు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ×నో టుబాకో..నో డ్రగ్స్‌÷ అంశంపై అధ్యాపకులు, విద్యార్థులు చర్చించారు. అధ్యాపకులు శ్రీరామ్మూర్తి, సరిత, నారాయణరావు, దయాసాగర్, చంద్రబోస్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ నల్లి రాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం అలవరచుకోండి



కడలిలో విత్తనాలు అందిస్తున్న డీపీఎం సత్యనారాయణ



వక్కలంకలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

రాజోలు: రైతులు ప్రకృతి వ్యవసాయం అలవరచుకోవాలని ప్రకృతి వ్యవసాయ శాఖ అడిషనల్ డీపీఎం సత్యనారాయణ సూచించారు. బుధవారం మండలంలోని కడలి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ద్వారా మేలు రకమైన కూరగాయ విత్తనాలు కొనుగోలు చేసి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు, రైతులకు ఇస్తుందన్నారు. వీటి ద్వారా రైతులకు వివిధ రకాల మోడల్స్ వేసి వాటి ద్వారా నిరంతరం ఆదాయం వచ్చేలా చేయాలని రైతులకు సూచించారు. విత్తనాలు రైతులకి సరఫరా చేసి వారి స్థలాల్లో ఏటీఎం మోడల్ ఏ గ్రేడ్ మోడల్ వేయడంతో పాటు స్వయం సహాయ సంఘ సభ్యులు అందరూ కూడా ఇంటి వద్ద కిచెన్ గార్డెన్స్ 365 రోజులూ ఉండేటట్టు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఇక మీద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నిత్యం రైతులతో మాట్లాడి సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది జోన్ మాస్టర్ ట్రైనర్, జోసఫ్, ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ మట్ట శ్రీనివాసరావు, యూనిట్ ఇన్‌చార్జెస్, జూలీ, కిరణ్ మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయం ఎక్కువ మంది రైతులు ఆచరించేలా వారికి అవగాహన కల్పించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. వక్కలంకలో రైతు గుత్తుల ధర్మారావు పొలంలో ప్రకృతి వ్యవసాయాన్ని బుధవారం పరిశీలించి వారు చేసే పద్ధతులను బోసుబాబు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆలోచన చేసే విధంగా సిబ్బంది పని చేయాలన్నారు. కేవలం తక్కువ మందికే పరిమితమై విధులు నిర్వహించడం సరికాదన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, పంటలు వాటి విశిష్టతలపై రైతులకు వివరించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కొన్ని చోట్ల మాత్రమే ప్రకృతి వ్యవసాయాన్ని పరిమితం చేయడం సరికాదని సిబ్బందిని హెచ్చరించారు. పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఓలు సీహెచ్‌డీ విజయ్‌కుమార్, జి.శ్రీనివాస్, పి.గన్నవరం సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయ విభాగ అధికారిని ఆర్.రాధిక, మాస్టర్ ట్రైనర్ జె.నాగమణి, వీఏఏ బి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సీట్లు పెంచి ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలి

రాజోలు: మెడికల్ కళాశాలల్లో సీట్లు పెంచి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలని రాజోలు నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు ఆకుమర్తి భూషణం కోరారు. బుధవారం ఆయన రాజోలులో మాట్లాడుతూ మెడికల్ సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ అమలు చేస్తు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టం కలుగుతుందన్నారు. అలాగే సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుకు అనుకూలంగా ఉన్న జీఓ 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబానికి రూ.5 వేల సాయం

పి.గన్నవరం: వశిష్ట నదిలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంలో ఊడిమూడికి చెందిన యువకుడు చదలవాడ విజయకృష్ణ మృతి చెందగా అతడి కుటుంబానికి బుధవారం నామన ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు రూ.5 వేలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్యకాపు, నాయకులు వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల హర్షం

మామిడికుదురు: మండలంలోని నగరం గ్రామంలో రేషన్ సరకుల గొడౌన్ వద్ద బుధవారం నాలుగు మండలాలకు చెందిన రేషన్ డీలర్లు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. ఎండీయూ వాహనాలను రద్దు చేసి రేషన్ డీలర్ల ద్వారానే సరకులు విక్రయిస్తామంటూ సీఎం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని డీలర్లు పేర్కొన్నారు. మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన రేషన్ డీలర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు క్షీరాభిషేకం నిర్వహించామని చెప్పారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలసి అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు, నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ జీవితాల్లో వెలుగు నింపిన స్కూల్‌ను మార్చిపోలేమన్నారు. తమలాగే ఉన్నత స్థానాలకు చేరాలని స్టడీ మెటీరియల్స్, బుక్స్ అందజేసి తద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులను కోరారు. అన్నిదానాల కన్నా విద్యాదానం గొప్పదని అందుకే విద్యార్థులను ప్రోత్సహించే పని చేశామన్నారు. ఇలాగే ప్రతి ఏడాది స్కూల్లో స్టడీ మెటీరియల్ అందజేస్తామని, అంతేకాకుండా తమకు చేతనైన సాయం చేసి ఉన్నత చదువుకు అవసరమైన సహాయం చేస్తామని చెబుతున్నారు విద్యార్థులు. అంతకుముందు పూర్వ విద్యార్థులు సమకూర్చిన నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ హెచ్‌హెం కడలి సాయిరామ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు.

తల్లిపాలతో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ



కొత్తపేట డిగ్రీ కళాశాలలో తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వైద్య సిబ్బంది సూర్యకుమారి

రాజోలు: తల్లిపాలుతో చిన్నారులకు ఆరోగ్య పరిరక్షణ కలుగుతుందని సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సోంపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. నవజాత శిశువులకు తల్లిపాలు పట్టించడం వలన కలిగే ప్రయోజనాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్రాంతికుమారి వివరించారు. అనంతరం పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం, బాల సంజీవని కిట్లు అందజేశారు. ఏఎన్‌ఎం పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్త కె.దుర్గాభవాని, ఆయా సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని అవిడి పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ సూర్యకుమారి విద్యార్థినులకు సూచించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, జువాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అధ్యక్షతన తల్లి పాలు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే మన ప్రాంతాల్లో తయారయ్యే చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా చేనేత పరిశ్రమను ఆదరించి కాపాడుకుందామని ప్రిన్సిపాల్ అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. చేనేత ఉత్పత్తుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డాక్టర్ డీసీహెచ్ పాపారావు, ఐక్యూసీ కోఆర్డినేటర్ కె.అంకమ్మరావు, లెక్చరర్లు సత్యనారాయణ, టి.రమాదేవి, నాగశ్రీలక్ష్మి, సత్య, బి.విజయకుమార్, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, ఎంఎల్‌హెచ్‌పీ ధన వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం



రాజోలు ఎస్సై రాజేష్‌కుమార్



నగరం ఎస్సై చైతన్యకుమార్

మామిడికుదురు: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తానని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. నగరం ఎస్సైగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన చైతన్యకుమార్‌కు ఏఎస్‌ఐ కృష్ణ, కానిస్టేబుల్స్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ప్రజలు సామరస్యంగా మెలిగే విధంగా కృషి చేస్తానన్నారు. ఆయన మండపేట రూరల్ ఎస్సైగా పని చేస్తూ బదిలీపై నగరం వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎస్సైగా పని చేసిన సురేష్ మలికిపురం ఎస్సైగా బదిలీ అయ్యారు.

రాజోలు ఎస్సైగా రాజేష్‌కుమార్

రాజోలు: స్థానిక ఎస్సైగా బి.రాజేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన అయినవిల్లి నుంచి రాజోలు వచ్చారు. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్‌కుమార్‌ను పలువురు నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, కోడిపందాలు, అక్రమ మద్యం తరలింపుపై అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. ఏదైనా అపాయం, ప్రమాదం సంభవిస్తే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయన రాజోలు సీఐ గోవిందరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ

కొత్తపేట: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా నియమితులైన జి.సురేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ద్రాక్షారామం ఎస్సైగా పనిచేసిన సురేంద్ర ప్రస్తుత పోలీసు బదిలీల్లో కొత్తపేట ఎస్సైగా నియమితులైన విషయం తెలిసిందే. ఆయన జాయిన్ అయిన సందర్భంగా స్టేషన్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం మండలంలో స్థితిగతులు, శాంతిభద్రతల పరిస్థితులపై సమీక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సిబ్బంది, ప్రజలు సహకరించాలని కోరారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

మలికిపురం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అలుపెరుగని న్యాయ పోరాటం చేస్తామని మలికిపురం, సఖినేటిపల్లి మండలాల ఎస్సీ మాలల సంఘాల నాయకులు ప్రతిజ్ఞ చేశారు. స్థానిక పూలే–అంబేడ్కర్ సామాజిక భవనంలో సఖినేటిపల్లి, మలికిపురం మండలాల ముఖ్య నాయకుల సమావేశం దళిత నాయకులు చింతా రాజబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య మాల నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ అంశంలో రాజోలు నియోజకవర్గం నుంచి మాలల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు జగడం సత్యనారాయణ, గెడ్డం తులసి భాస్కరరావు, గెడ్డం ఫిలిప్‌రాజు, తోటే ప్రతాప్, గెడ్డం సింహ, కుసుమ చంద్రశేఖర్, నల్లి శివకుమార్, సర్పంచ్ రాపాక ఆనందకుమార్, ఎంపీటీసీలు తోటి రాజేష్, గోసపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ పోరాటం చేస్తాం

సఖినేటిపల్లి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అలుపెరగని న్యాయ పోరాటం చేస్తామంటూ మండల మాల మహానాడు నాయకులు ప్రతిజ్ఞ చేశారు. బుధవారం స్థానిక సమతా కల్యాణ మండపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు నాయకుల సమావేశం తోటె ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగానికి వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజోలు నియోజకవర్గం నుంచి మాలల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.